సాక్షి
మంచిర్యాల
శనివారం । 19 । ఆగస్టు । 2023

62.5శాతం మాత్రల పంపిణీ

మంచిర్యాలటౌన్: బోదకాల నివారణ కోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నివారణ మాత్రలు పంపిణీ జిల్లాలో 62.5 శాతం పూర్తయినట్లు జిల్లా కీటక జనిత నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత తెలిపారు. ఈ నెల 22వరకు ఇంటింటికి వెళ్లి మాత్రలు వేస్తామని, ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 5,04,327 మందికి మాత్రలు వేశామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థులు, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లకు శుక్రవారం మాత్రలు వేసినట్లు తెలిపారు.



నిండుకుండలా 'ఎల్లంపల్లి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం 20.175 టీఎంసీలకు ప్రస్తుతం 19.455 టీఎంసీలు ఉంది. శుక్రవారం ఇన్‌ఫ్లో 6 వేల క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 3 వేల క్యూసెక్కులు ఉంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /24.0

ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ చిరుజల్లులు కురుస్తాయి. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

డీపీవో కార్యాలయం తరలింపు



చాంబర్‌లో డీపీఓ, ఉద్యోగులు

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): 'భయం గుప్పిట్లో విధులు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరిందని, పై కప్పు పెచ్చులూడుతూ ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. దీంతో స్పందించిన డీపీవో వెంకటేశ్వర్‌రావు కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు కార్యాలయ తరలింపునకు తక్షణ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం హుటాహుటిన నస్పూర్ సమీకృత కలెక్టరేట్‌లోని కార్యాలయాన్ని ప్రారంభించారు. సిబ్బంది సమక్షంలో డీపీఓ చాంబర్‌లో కార్యాలయ విధులకు శ్రీకారం చుట్టారు.

లబ్ధిదారులకు పథకాలు అందించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



పాల్గొన్న కలెక్టర్ బి.సంతోష్, అదనపు కలెక్టర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: సంక్షేమ పథకాలు, కార్యక్రమాల ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల అమలు, తెలంగాణకు హరితహారం, గృహలక్ష్మి, ఇళ్లపట్టాల పంపిణీ, నోటరైజ్ భూముల క్రమబద్ధీకరణ, జీవో నం 59, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాలకు రూ.లక్ష ఆర్థిక సహాయం, రెండో విడత గొర్రెల పంపిణీ, కారుణ్య నియామకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ హరితహారం లక్ష్యాలను ఈ నెల 26లోగా పూర్తి చేయాలని చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీ యూనిట్లు గ్రౌండింగ్ చేయాలన్నారు. కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 26న కోటి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో 116 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరణకు సిఫారసు చేయగా ఏడుగురికి ఉత్తర్వులు అందజేశామని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్లు బి.రాహుల్, మోతిలాల్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

మంచిర్యాలఅర్బన్: నైపుణ్యాలు మెరుగుపర్చుకునేందుకు సీఆర్పీలకు శిక్షణ ఎంతో దోహదం చేస్తుందని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం జిల్లా సైన్స్ కేంద్రంలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తొలిమెట్టుపై సీఆర్పీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రతీ కార్యక్రమంలో సీఆర్పీలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. తొలిమెట్టుకు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, హేమలత, రాజ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర బాధ్యులు నరసింహాచారి, జిల్లా బాధ్యుడు నితిన్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిర్వాసితుల రాస్తారోకో



రాస్తారోకోలో రఘునాథ్, నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పరిధిలోని నిర్వాసితులకు న్యాయం చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ మాట్లాడుతూ ముంపు బాధితుల పెండింగ్ బకాయిలు చెల్లించాలని, ఇంటి నిర్మాణానికి రూ.70 వేల పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, రూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేశ్ కుమార్ ఆందోళన విరమింపజేశారు. హాజీపూర్ తహసీల్దార్ తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొలి శెట్టి తిరుపతి, అసెంబ్లీ కన్వీనర్ తోట మల్లికార్జున్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రజనీశ్‌జైన్, నాయకులు గడ్డం స్వామిరెడ్డి, మోటపలుకుల తిరుపతి, సత్యం, ముంపు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు.

కుష్ఠు.. జర భద్రం!



జైపూర్ మండలంలో ఇంటింటి సర్వే చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బరాయుడు, వైద్యసిబ్బంది

- జిల్లాలో 70 మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స
- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- గ్రామీణ, ఆవాస ప్రాంతాల్లోనే అధికం
- 31వరకు ఇంటింటికీ వెళ్లి పరిశీలన

మంచిర్యాలటౌన్: జిల్లాలో కుష్ఠు వ్యాధి విస్తరిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు 32మంది కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించగా ప్రస్తుత సర్వేలో మరో ఇద్దరిని గుర్తించడంతో ఆ సంఖ్య 34కు చేరింది. జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ నెల 16నుంచి 31వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం అనే కార్యక్రమం చేపడుతున్నారు. వైద్యబృందం ఇంటింటికీ వెళ్లి అనుమానితులను పరీక్షించి వ్యాధిని గుర్తిస్తున్నారు. దీంతోపాటు గ్రామీణ, ఆవాస ప్రాంతాల్లోని ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ నెల 16, 17, 18న సాగిన ఇంటింటి సర్వేలో ఇద్దరు కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించారు. గత ఏడాది నుంచి కుష్ఠువ్యాధిని గుర్తించి 70 మందికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చికిత్స, మందులు అందిస్తున్నారు. ఈ నెల 31వరకు వైద్య సిబ్బంది ప్రతీ ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి కుష్ఠువ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రానికి పరీక్షల కోసం పంపించి వ్యాధి నిర్ధారణ చేయనున్నారు. నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందించి జిల్లాలో వ్యాధిని నిర్మూలించాలన్నదే వైద్యారోగ్య శాఖ ఉద్దేశం. కుష్ఠు వ్యాధిని భయంకరమైన జబ్బుగా పరిగణించకుండా ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకుని వైద్య సిబ్బంది వచ్చినప్పుడు నిర్భయంగా చెప్పాలని, చికిత్స అందిస్తే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకునేందుకు అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

అదుపులోకి రాని వ్యాధి

జిల్లాలో కుష్ఠువ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య అదుపులోకి రావడం లేదు. నివారణ చర్యలు చేపడుతున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడం లేదు. జిల్లావ్యాప్తంగా గత ఏడాది 113 మందిని గుర్తించగా ఈ ఏడాది ఇప్పటివరకు 34 మందిని గుర్తించారు. వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం, ఒకవేళ తెలిసినా బయటకు చెబితే సామాజికంగా దూరమవుతామనే భయంతో బాధితులు అలాగే కాలం గడుపుతున్నారు. వెరసి ఇతరులకు వ్యాధి సోకడానికి వారు కారకులు అవుతున్నట్లు ప్రభుత్వ గుర్తించింది. దీంతో ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు.

బయటకు చెప్పుకోలేకనే..

కుష్ఠువ్యాధి మైక్రో బ్యాక్టీరియా లిప్రే వల్ల వచ్చే అతి సామాన్యమైన జబ్బు. ఈ వ్యాధిపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామీణ ప్రాంతాలు, ఆవాస తండాల్లో బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ గుర్తించింది. బాధితులు సమాజానికి దూరం అవుతామనే భయంతో బయటకు చెప్పుకోలేక తీరా వ్యాధి తీవ్రమవుతుండగా, ఇతరులకు, ముఖ్యంగా తమ కుటుంబ సభ్యులకు, సమీపంలో నివసించే వారికి ఈ వ్యాధి సోకడానికి కారకులు అవుతున్నారు. ఈ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే నయం చేయవచ్చు. ఇందులో భాగంగానే వైద్య, ఆరోగ్యశాఖ 15 రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది.

లక్షణాలు

- కుష్ఠువ్యాధి ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది. చాలా నెమ్మదిగా పెరిగి వ్యాధి లక్షణాలు బహిర్గతం కావడానికి సగటున మూడేళ్ల(ఇంక్యుబేషన్ కాలం) వరకు పడుతుంది.
- ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు. దీనికి వయస్సు, లింగభేదం లేదు. వంశపారంపర్యం కాదు.
- యండీటీ(బహుళ ఔషధ చికిత్స)తో ఆరు నెలల నుంచి 12 నెలల్లో పూర్తిగా నయమవుతుంది. కుష్ఠు రోగులు పూర్తి సామాజిక జీవితం గడపవచ్చు.
- వ్యాధి మచ్చలు సహజ చర్మపు రంగు కంటే తక్కువగా లేదా ఎరుపు లేదా రాగి రంగు కలిగి ఉంటాయి.
- మచ్చలపై స్పర్శ, నొప్పి ఉండదు.
- శరీరంలో ఏ ప్రదేశంలోనైనా రావచ్చు.
- కాళ్లు, చేతుల నరాల్లో వాపు నొప్పి, బలహీనత, తిమ్మిరులు, ముఖంపై చెవి బయట నూనె పూసినట్లు మెరుస్తున్నా, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోయిన, కనురెప్పలు పూర్తిగా మూతపడక పోయినా, చేతి వేళ్ల స్పర్శ కోల్పోయి, వంకర పోవడం, చేతి మణికట్టు, పాదాలలో బలహీనత, వాలిపోవడం.

జిల్లాలో వ్యాధిగ్రస్తుల వివరాలు

ఏప్రిల్ నుంచి మార్చి	గుర్తించింది
2019–20	154
2020–21	83
2021–22	74
2022–23	113
2023–24	32 (జూలై నెల వరకు)

ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తున్నాం



ఇంటింటికీ వెళ్లి ప్రతీ ఒక్కరిని పరిశీలించిన తర్వాత ఆ ఇంటికి రైట్ మార్క్ వేస్తారు. ఏదైనా అనుమానం ఉంటే వారిని లెప్రసీ అధికారులు పరిశీలించి వెంటనే చికిత్స ప్రారంభించి మందులు అందిస్తారు. వ్యాధిని బట్టి ఆరు నెలల నుంచి ఏడాది వరకు చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లాలో పూర్తిస్థాయిలో కుష్ఠువ్యాధిని అరికట్టేందుకు ఈ నెల 16నుంచి 31వరకు చేపట్టే ఇంటింటి సర్వేతోపాటు ప్రజలకు అవగాహన కల్పించడం ఎంతగానో ఉపయోగపడుతుంది.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్యాధికారి

విజృంభిస్తున్న జ్వరాలు

- ఆస్పత్రిలో సరిపోని పడకలు
- మహారాష్ట్ర నుంచి డెంగీ కేసులు



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో మార్పులతో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతోంది. చెన్నూర్ మండలం ఎల్లక్కపేటలోని సీహెచ్‌సీలో 30 పడకలు ఉన్నాయి. శుక్రవారం 80 మంది జ్వరాల బాధితులు ఉండడంతో వైద్యులు ఇద్దరేసి రోగులకు ఒక బెడ్ చొప్పున కేటాయించారు. మరికొందరికి ఇంజక్షన్లు ఇచ్చి ఇళ్లకు పంపించారు.

పది మందిలో ఇద్దరికి డయేరియా..

వర్షాల కారణంగా కుంటలు, చెరువులు, బావుల్లో కొత్త నీరు చేరింది. బోరు పంపులు, బావులు, నల్లాల నుంచి వచ్చే నీరు కలుషితమైతే డయేరియా కేసులు పెరిగే అవకాశాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం పది మందిలో ఇద్దరు డయేరియాతో ఆస్పత్రిలో చేరుతున్నారు. నల్లాల నుంచి సరఫరా అయ్యే నీటిని క్లోరినేషన్ చేయాలని ప్రజలు కోరుతున్నారు. పక్కనున్న మహారాష్ట్రలోని సిరోంచ నుంచి వచ్చే జ్వర పీడితుల్లో డెంగీ లక్షణాలు బయటపడుతున్నాయి. దీంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. డెంగీ లక్షణాలు ఉన్న రోగులను మంచిర్యాల, కరీంనగర్ పట్టణాలకు తరలిస్తున్నారు.

పెరిగిన దోమలు

గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అధికారులు దోమల నియంత్రణ చర్యలు మొక్కుబడిగా చేపట్టారు. పూర్తి స్థాయిలో దోమలను నివారించడంలో విఫలమయ్యారు. దోమలు విపరీతంగా వృద్ధి చెంది వైరల్, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు.

చికిత్స అందిస్తున్నాం..



గత రెండు మూడు రోజుల నుంచి జ్వరాలు పెరుగుతున్నాయి. సిరోంచ నుంచి వచ్చే కొన్ని కేసుల్లో డెంగీ లక్షణాలు కనిపిస్తున్నాయి. సాధ్యమైనంత వరకు చికిత్స అందిస్తున్నాం. డయేరియా బాగా లేదు. ఒకట్రెండు కేసులు వస్తున్నాయి. సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. కాచిన నీటిని మాత్రమే సేవించాలి.

–డి.సత్యనారాయణ, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ

లక్కెవరిదో..!

- ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణ
- 73 దుకాణాలకు 2,231 టెండర్లు
- ఈ నెల 21న లక్కీడ్రాకు ఏర్పాట్లు



దరఖాస్తుల సమర్పణకు బారులు తీరిన వ్యాపారులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో 2023–25 కొత్త మద్యం పాలసీ అమలుకు దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం ముగిసింది. ఈ నెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా జిల్లాలోని 73 దుకాణాలకు శుక్రవారం రాత్రి వరకు 2,231 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం ఆరు గంటల వరకే దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా.. వ్యాపారులు అధిక సంఖ్యలో రావడం, వర్షం పడడంతో కొంత అంతరాయం ఏర్పడింది. నిర్ణీత సమయంలో వచ్చిన వ్యాపారులకు టోకెన్లు ఇచ్చారు. ఆరు గంటల్లోపు టోకెన్లు తీసుకున్న వారి దరఖాస్తులను పూర్తిగా తీసుకునే అవకాశం ఉంది. గత ఏడాది 1194 దరఖాస్తులు రాగా ఈ ఏడాది దాదాపుగా రెట్టింపు దరఖాస్తులు రావడం గమనార్హం. జిల్లాలోని ఇందారం గెజిట్ నంబరు–1 దుకాణానికి అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియడంతో దుకాణాల నిర్వహణకు లక్కెవరిదో తేలనుంది. ఈ నెల 21న లక్కీడ్రా పద్ధతిలో మద్యం దుకాణాల ఎంపికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డ్రాలో దుకాణం తగిలినా తగలకపోయినా ఎలాగైనా దుకాణం పట్టాల్సిందేనని పాత వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. గుడ్‌విల్ ఇచ్చి కొనుగోలు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. కొందరు సిండికేట్ అయి దరఖాస్తులు వేసుకున్నట్లు సమాచారం. కొత్తగా వ్యాపారంలోకి అడుగు పెడుతున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దరఖాస్తులు వేసిన వారితో ఇప్పుడే ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

పెరిగిన ఆదాయం

గత ఏడాది 73 దుకాణాలకు 1194 దరఖాస్తులు రాగా రూ.23.88కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి 2,231 దరఖాస్తులు రాగా రూ.44.62 కోట్లు ఆదాయం సమకూరింది. అత్యధికంగా ఇందారం మద్యం దుకాణానికి 86 దరఖాస్తులు రాగా, ఇందన్‌పల్లి మద్యం దుకాణానికి 9 దరఖాస్తులే వచ్చాయి.

డివిజన్ల వారీగా దరఖాస్తులు

మంచిర్యాల	1138
బెల్లంపల్లి	560
లక్సెట్టిపేట	240
చెన్నూర్	293

రిజర్వేషన్ల వారీగా..

రిజర్వేషన్	షాపులు	టెండర్లు
ఎస్సీ	10	224
ఎస్టీ	06	065
గౌడ్స్	06	181
ఓపెన్	51	1761

గడి భూములపై అధికారుల సర్వే



సర్వే చేస్తున్న తహసీల్దార్ రమేశ్, అధికారులు

జైపూర్: మండలంలోని ఇందారం గడి(కోట) భూముల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. కోటను ఆనుకుని పట్టా భూమిలో వెంచర్ ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఇందారం గ్రామంలో కోట నిర్మించిన గోనె వెంకటముత్యంరావు నిజాం ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగాడు. ఆయన అనేకమందికి భూ దానాలు, భూములు విక్రయం చేశాడు. కోట చుట్టూ దొర పేరిట దొరగారిపల్లె అని వెలిసింది. కొందరికి నివాస స్థలాలు ఇవ్వగా ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. రజాకార్ల ఉద్యమ సమయంలో గోనె వెంకట ముత్యంరావు హైదరాబాద్‌కు వెళ్లడం, అక్కడే మరణించడం జరిగింది. నేటికీ అనేకమంది ప్రజల ఇళ్ల స్థలాలు వారి వారసులపైనే పట్టాలు ఉన్నాయి. నాడు ప్రజల ఉపయోగం కోసం వెంకటముత్యంరావు భార్య అండాళ్లమ్మ కొంత భూమిని మహేశ్ ఎడ్యుకేషనల్ సొసైటీకి దానం చేశారు. తాజాగా గడి చుట్టూ ఉన్న భూముల్లో వెంచర్ ఏర్పాటు కావడం చర్చనీయాంశమైంది. అండాళ్లమ్మ 2003 వరకు జీవించి ఉన్నదా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వెంచర్ ఏర్పాటు చేసిన భూములను రెవెన్యూశాఖ అధికారులు శుక్రవారం సర్వే చేశారు. సర్వేనంబరు 191లో 9.23 ఎకరాలు, సర్వేనంబరు 192లో 5.23 ఎకరాలు భూమి హద్దులను తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ కమల, సర్వేయర్ మధుకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మ్యాప్ ద్వారా అక్కడి హద్దులు, గడి భూమి, గోనె అండాళ్లమ్మ మహేశ్ ఎడ్యుకేషనల్ సొసైటీకి దానం చేసిన సర్వేనంబరు 192లో 2.8 ఎకరాల భూమిని పరిశీలించారు. అండాళ్లమ్మ 15.6ఎకరాల పట్టా భూమిని మంచిర్యాలకు చెందిన శ్యాంసుందర్ అగర్వాల్‌కు విక్రయించినట్లుగా తెలిపారు. సొసైటీకి ఇచ్చిన భూమికి, దీనికి ఎలాంటి సంబంధం లేదని, దానంగా ఇచ్చిన భూమి, కోట వేర్వేరుగా ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు.

ఎస్టీపీపీని దేశంలో అగ్రగామిగా నిలపాలి

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ని విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో దేశంలోనే అగ్రగామిగా నిలపాలని డైరెక్టర్(ప్లానింగ్, ప్రాజెక్టు) జి.వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీపీపీని శుక్రవారం ఆయన సందర్శించారు. అడ్మిన్ భవన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పవర్‌ప్లాంటు విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణపై చర్చించారు. 100శాతం పీఎల్‌ఎఫ్ సాధనతోపాటు యాష్ వినియోగం, పర్యావరణ పరిరక్షణపై ఎస్టీపీపీ సాధించిన ప్రగతి, అవార్డులపై అధికారులును అభినందించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు కమలాకర్ భూషణ్, నారాయణరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

నస్పూర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డైరెక్టర్(ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డితో కలిసి జీఎం కార్యాలయం ఎదుట ఉన్న సెంట్రల్ నర్సరీని సందర్శించారు. మొక్క నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రఘుకుమార్, డీజీఎం(సివిల్) శివరావు, ఫారెస్టు మేనేజర్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

నస్పూర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల సందర్భంగా సమీకృత కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు బీసీ వెల్ఫేర్ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి జి.సత్యం, బీసీ సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గాజుల ముఖేశ్‌గౌడ్, తోట శ్రీనివాస్, గౌడ్, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక

నస్పూర్: జిల్లాలో గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడుతామని కలెక్టర్ సంతోష్ తెలిపారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 50,501 దరఖాస్తులు వచ్చాయని, పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కారుణ్య నియామకాల ధ్రువపత్రాల పరిశీలన

నస్పూర్: జిల్లాలోని వివిధ శాఖల్లో కారుణ్య నియామకాల కింద అర్హుల ధ్రువపత్రాలను పరిశీలిస్తామని కలెక్టర్ సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కారుణ్య నియామకాల అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకాలకు హాజరైన 43 మంది పత్రాలను పరిశీలించామని, ఈ నెల 22న అర్హులకు పోస్టింగ్ ఇస్తూ నియామకపు ఉత్తర్వులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్నగౌడ్ జయంతి



నివాళులర్పిస్తున్న బీసీ జాగృతి నాయకులు

పాతమంచిర్యాల: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బీసీ జాగృతి నాయకులు, సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం రాజేందర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పల్లె భూమేష్, తెలంగాణ బీసీ జాగృతి పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారి సల్ల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి సూరన్న, బియ్యాల సత్తయ్య, పట్టణ కార్యదర్శి ఎంబడి కిషన్, కీర్తి రవీందర్, మంచెర్ల సదానందం, పత్తి గట్టయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్ పత్తి వెంకటేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం ఒక్కరోజు సమ్మె చేపట్టారు. విధులు బహిష్కరించి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంఘం యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమ్మెకు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్ మద్దతు తెలిపి, దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.సోహైల్‌ఖాన్, జి.మురళి, పి.రవికుమార్, సలీం, అన్వర్, నర్సింహులు, చింటు, సది, బి.రవి, సుధాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

కోటపల్లి(చెన్నూర్): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎద్దు మృతి చెందడమే కాకుండా యజమానికి తృటిలో ప్రాణాపాయం తప్పిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పుల్లగామకు చెందిన కావిరి చిన్నసమ్మయ్య శుక్రవారం తన ఎద్దును తీసుకుని పంటచేలకు వెళ్తుండగా రోడ్డుపై పడిఉన్న విద్యుత్ తీగలను తాకడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సమ్మయ్య తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. విషయాన్ని సర్పంచ్ సుమలత ద్వారా అధికారులకు సమాచారం అందించినా స్పందించలేదన్నారు. విద్యుత్ తీగలు తెగి పడి ఉన్నట్లు ముందురోజే స0మాచారం అందించినా లైన్‌మెన్ పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. లైన్‌మేన్, హెల్పర్ నిర్లక్ష్యంతోనే రూ.50 వేల ఎద్దు మృతి చెందిందని, గతంలో కూడా పలు ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. లైన్‌మేన్, హెల్పర్‌పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని సమ్మయ్య కోరుతున్నాడు.

‘అగాఖాన్’ టాలెంట్ టెస్ట్‌కు సీవోఈ విద్యార్థుల ఎంపిక

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అగాఖాన్ అకాడమీ నిర్వహించిన రీజియన్ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి రెండో దశకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆదిలాబాద్ రీజియన్ నుండి 46 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. ఈ నెల 28న రెండో దశ టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. జేవీపీ కొక్కుల రాజేశ్వర్, ఉపాధ్యాయులు స్రవంతి, శాతరాజు తిరుపతి, అజిత, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

కాగజ్‌నగర్‌టౌన్: మూడో రైల్వేలైన్ పనుల నిమిత్తం పలు రైళ్లను రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు కాగజ్‌నగర్ రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్ శ్యాంకుమార్ తెలిపారు. ఈ నెల 21 నుండి 28 వరకు కాజీపేట-సిర్పూర్ టౌన్ (రామగిరి), బల్లార్షా నుండి కాజీపేట (సింగరేణి), భద్రాచలం రోడ్డు నుండి బల్లార్షా (సింగరేణి), సిర్పూర్ టౌన్ నుండి భద్రాచలం రోడ్డు (రామగిరి), సిర్పూర్ టౌన్ నుండి కరీంనగర్ (పుష్‌పుల్), కరీంనగర్ నుండి సిర్పూర్ టౌన్ (పుష్‌పుల్), కాజీపేట నుండి బల్లార్షా (ప్యాసింజర్), బల్లార్షా నుండి కాజీపేట (ప్యాసింజర్) రైళ్లను రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

దృశ్యం.. సజీవం


పాత మంచిర్యాల: జక్కుల రాజు తీసిన గాంధారి మైసమ్మ జాతర ఫొటో

- మధుర స్మృతులు... కలకాలం పదిలం...
- ఫొటోలు శాశ్వతం...
- గతం తీపిగుర్తుల జ్ఞాపకం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రెప్పపాటు కాలంలో దృశ్యాన్ని బంధించి శాశ్వత కాలానికి సజీవ సాక్ష్యంగా నిలిపేదే ఛాయాచిత్రం. గత స్మృతులను సైతం పది కాలాలపాటు పదిలంగా మన ముందు మెదిలేలా నిత్యం ప్రత్యక్షంగా కనిపించేవే ఫొటోలు. ప్రకృతి అందాలు, పారే సెలయేర్లు, పచ్చిక బయళ్లు, వినీలాకాశ వింతలు, సప్తవర్ణ శోభితాలు కనులముందు నిలిపేవి ఛాయాచిత్రాలు. 1839 ఆగస్టు 19న ఫ్రాన్స్‌కు చెందిన ఎల్.జె.ఎం.డ్యాగురే తొలిసారిగా సెన్సర్ అయోడైజ్డ్ ద్వారా తీసిన చిత్రాలను ఫ్రాన్స్ సైన్స్ అకాడమీకి అప్పగించారు. అప్పుడే ఆయన ఫొటోలను ఫ్రాన్స్ గుర్తించి ఆగస్టు 19నే ప్రపంచ ఫొటోగ్రఫీ దినంగా ప్రకటించారు. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కథనం.

అందమైన అడవులు.. అద్భుత చిత్రాలు

జన్నారం(ఖానాపూర్): పచ్చని అడవుల అందాలకు కేరాఫ్ కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం కవ్వాల్ అభయారణ్యం. పక్షుల కిలకిల రావాలు, వన్యప్రాణుల పరుగులు, వన్యమృగాల గాండ్రింపులు, అడవి అందాలను బయటకు తీయడానికి డివిజనల్ ఫారెస్ట్ అధికారి సిరిపురం మాధవరావు కెమెరా చేతబట్టారు. వృత్తి పరంగా అటవీశాఖ అధికారి అయినా ఫొటోలు తీయడం ఆయన హాబీ. అడవిలోకి బైనాకిల్ కెమెరాను భుజాన వేసుకుని వెళ్తారు. రెండేళ్ల క్రితం తాను తీసిన గద్ద ఫొటో జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికైంది. జన్నారం అటవీ డివిజన్‌లోని టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఫొటోగ్రాఫర్ ఎల్లం కూడా తనదైన శైలిలో ఫొటోలు తీసి అబ్బుర పరుస్తున్నారు. దట్టమైన అడవుల్లోని జలపాతాలు, పచ్చని చెట్లతో ఒదిగిన గుహలు, అందమైన చెట్లు, పక్షుల ఫొటోలు తీసి తనదైన శైలిలో ప్రపంచానికి చూపుతున్నారు.


జన్నారం: ఎల్లం తీసిన చింతలమాదర జలపాతం ఫొటో


జన్నారం: కవ్వాల్ అభయారణ్యం


జన్నారం: రొమాంటిక్ చిలుకలు


మంచిర్యాలరూరల్(హాజీపూర్): ర్యాలీ జలపాతం

ఫొటోగ్రఫీలో రాణిస్తున్న రాజు


రాజును సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రానికి చెందిన జక్కుల రాజు 1997 నుంచి ఫొటోగ్రఫీలో రాణిస్తున్నారు. సొంతంగా ఫొటో, వీడియోగ్రఫీ చేస్తూ పదిమందికి ఈ వృత్తిలో శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై డాక్యుమెంటరీలు నిర్మిస్తు అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. 2022లో జిల్లా కేంద్రంలోని బొక్కల గుట్ట గాంధారి మైసమ్మ జాతర డాక్యుమెంటరీ నిర్మించినందుకు అప్పటి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ప్రశంసాపత్రంతో సన్మానించారు. ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వహించిన తెలంగాణ బోనాల పండగ ఫొటోగ్రఫీ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 2019లో మంచిర్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో పాల్గొని ప్రథమ బహుమతి సాధించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి ఫొటోలకు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు చేతుల మీదుగా ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- కంటెయినర్‌ను ఢీకొన్న లారీ
- డ్రైవర్, క్లీనర్ మృతి


డ్రైవర్ హనుమంతు, క్లీనర్ సురేష్ మృతదేహాలు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీసు స్టేషన్ పరిధిలోని అందుగులపేట వద్ద కోరెగట్టు అంజనేయస్వామి ఆలయం సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఆగి ఉన్న ఎక్స్‌ప్లోజివ్ కంటెయినర్‌ను లారీ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ఎస్సై చంద్రకుమార్, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న ఎక్స్‌ప్లోజివ్ కంటెయినర్‌లో సాంకేతిక లోపం ఏర్పడడంతో డ్రైవర్ రోడ్డుపై నిలిపి మెకానిక్ కోసం మందమర్రి పట్టణానికి వెళ్లాడు. ఛత్తీస్‌గఢ్ నుంచి బెంగళూర్ వైపు జే వైర్ లోడ్‌తో వెళ్తున్న లారీ అతివేగంగా రోడ్డుపై ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. దీంతో అనంతపురం జిల్లా హిందూపురం మండలం లేపాక్షికి చెందిన లారీ డ్రైవర్ హనుమంతు(28), క్లీనర్ సురేష్(45) తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై చంద్రకుమార్ క్షతగాత్రులను లారీ నుంచి బయటకు తీసి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సురేష్ మార్గమధ్యంలో, ఆస్పత్రిలో డ్రైవర్ చనిపోయారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): కడుపునొప్పి భరించలేక వృద్ధుడు బలవన్మరణం చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం దొనబండకు చెందిన పెరంబుదునూరి జగ్గయ్య(76)వృద్ధాప్యంతో పాటు ఆరోగ్య సమస్యలతో ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నాడు. శుక్రవారం సిద్దిపేటలో ఉంటున్న తన కుమారుడు రామానుజంకు ఫోన్‌చేసి కడుపునొప్పి తీవ్రంగా ఉందని చెప్పడంతో పెన్షన్ తీసుకుని సిద్దిపేటకు వచ్చాక ఆస్పత్రిలో చూపిస్తానన్నాడు. కొంతసేపటికే ఇంటిముందున్న సజ్జ పైభాగంలోని ఇనుప కొక్కానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామానుజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడు ఆత్మహత్య


అశోక్ (ఫైల్)

నస్పూర్: ఉరేసుకుని సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘట న పట్టణ పరిధి లోని శ్రీరాంపూ ర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టన పరిధిలోని శ్రీరాంపూర్ లక్ష్మీనగర్‌కు చెందిన ఏనుగుల అశోక్ (34) శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 7 గనిలో ట్రామర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. అతని మానసిక పరిస్థతి సరిగా లేకపోవడంతో గురువారం రాత్రి తన ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహ త్య చేసుకున్నాడు. మృతునికి భా ర్య రమ, కూతురు ఉన్నారు. కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా పోచం

చెన్నూర్: నేతకాని హక్కుల పోరాట (చైతన్య) సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా చెన్నూర్‌కు చెందిన రాంటెంకి పోచం నియామకమైనట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కే నేతకాని తెలిపారు. శుక్రవారం నియామక పత్రం అందజేశారు. పోచం మా ట్లాడుతూ జిల్లాలోని నేతకాని సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

అడవికుక్కల దాడిలో 11 మేకలు మృతి

కోటపల్లి: మండలంలోని అన్నారంలో మేకల మందపై అడవి కుక్కలు దాడి చేసిన ఘటనలో 11 మేకలు మృతి చెందినట్లు సమ్మయ్య, కిష్టయ్య తెలిపారు. శుక్రవారం అన్నారం గ్రామ శివారులోని అటవీప్రాంతంలో వర్షం రావడంతో మేకల మంద రెండుగా విడిపోయింది. ఒక గ్రూపు మేకల మందపై 9 అడవి కుక్కలు దాడిచేసి 11 మేకలను హతమార్చాయి. ఇంకా ఆరు మేకల ఆచూకీ లభించలేదని బాధితులు వాపోయారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించినట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థినికి ఆశ్రయం కల్పించిన ‘సఖి’


విద్యార్థినితో సఖి సెంటర్ నిర్వాహకులు

మంచిర్యాలక్రైం: డిగ్రీ పరీక్షలు రాసేందుకు జగిత్యాల నుంచి లక్సెట్టిపేటకు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థినికి మంచిర్యాల సఖి సెంటర్ నిర్వాహకులు రెండు రోజుల పాటు రక్షణ కల్పించి పరీక్షలు రాయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సఖి సెంటర్ నిర్వాహకురాలు శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాలకు చెందిన ఓ విద్యార్థిని ఈ నెల 16న లక్సెట్టిపేట డిగ్రీ కళాశాలలో పరీక్ష రాయాల్సి ఉంది. 16న వస్తే పరీక్ష సమయానికి హాజరు కాలేనని 15న రాత్రి ఇంట్లో నుంచి బయలుదేరింది. లక్సెట్టిపేటలో వసతి దొరకకపోవడంతో డిగ్రీ కళాశాల ఎదుట ఒంటరిగా నిస్సహాయ స్థితితో కూర్చుంది. పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోర్ట్ పోలీసులు సదరు విద్యార్థిని వివరాలు తెలుసుకుని సఖి సెంటర్‌కు సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది సదరు విద్యార్థినిని సఖి సెంటర్‌కు తీసుకువచ్చి వెల్‌కమ్ కిట్ అందజేశారు. పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. విద్యార్థినికి రక్షణ కల్పించిన సఖి సెంటర్ నిర్వాహకులను పలువురు అభినందించారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం


హద్దురాయి వేయిస్తున్న అధికారులు

నస్పూర్: పట్టణ పరిధిలో ఆయుర్వేదిక్ ఆస్పత్రి భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జా చేయగా శుక్రవారం ఆయుర్వేదిక్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయుష్ వరంగల్ రీజనల్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ రవినాయక్ మాట్లాడుతూ పట్టణంలోని ఆయుర్వేదిక్ ఆసుపత్రి భవన నిర్మాణానికి ప్రభుత్వం 2016లో నస్పూర్ శివారు సర్వే నంబరు 64లో నాలుగు గుంటల స్థలాన్ని కేటాయించిందన్నారు. నిధుల లేమితో భవన నిర్మాణం చేపట్టలేకపోయామన్నారు. ఇటీవల కొందరు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రహరీ నిర్మించడంతో విషయాన్ని తమ సిబ్బంది అదనపు కలెక్టర్ మోతీలాల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, పోలీసులు, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. వారు స్పందించి రెవెన్యూ అధికారుల సహాయంతో తమస్థలాన్ని అప్పగించగా చుట్టూ హద్దులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ నారాయణ, డాక్టర్ నీరజ, రెవెన్యూ ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ

జైపూర్(చెన్నూర్): జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ మోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబు, ఎస్సై ఉపేందర్‌రావు, అదనపు ఎస్సై నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: పట్టణంలోని సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్, మిడిల్, లాంగ్ డిస్టెన్స్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరు కాగా ప్రతిభ కనబర్చిన పది మంది విద్యార్థులను ఈనెల 20న బాయ్స్ స్పోర్ట్స్ ఆర్మీ కంపెనీ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో వివేక్ వర్దన్, సాయి కిరణ్, రవితేజ, సాత్విక్, సంతోష్, ప్రేమ్‌కుమార్, అంజన్న, రాహుల్, సాయికృష్ణ, వైష్ణవి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ గొడవలో ఇరు వర్గాలపై కేసు

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాల ఆంజనేయస్వామి విగ్రహం వద్ద బీఎస్పీ, బీఆర్‌ఎస్ యూత్ విభాగం శ్రేణుల మధ్య జరిగిన ఫ్లెక్సీ గొడవలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ టి.శంకరయ్య తెలిపారు. బీఎస్పీ నాయకుడు వరప్రసాద్ ఈనెల 2న విజయ్ ఆర్ట్స్ నిర్వాహకులకు రూ.3వేలు అద్దెచెల్లించి బోర్డింగ్‌కు ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. బీఆర్‌ఎస్ యూత్ విభాగం పట్టణ అధ్యక్షుడు సన్నీబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని విజయ్ ఆర్ట్స్ నిర్వాహకులతో మాట్లాడి వరప్రసాద్ కట్టిన ఫ్లెక్సీపై కట్టడంతో వివాదం తలెత్తింది. ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. కానీ కొంతమంది పోలీసులపై బురద జల్లే విధంగా సామాజిక మాధ్యమాల్లో మెసేజ్ చేస్తున్నారని, అలాంటి యత్నాలు విరమించుకోవాలని సూచించారు.

పాదయాత్రను అడ్డుకున్న పోలీసులు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని కోణంపేట, పాటి, బోగంపల్లి, వేమనపల్లి మండలంలోని నాగారాం, శ్రావణ్‌పల్లి, బొమ్మెన, కన్నెపల్లి మండలంలోని బుయ్యారం గ్రామాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కోణంపేట నుంచి ప్రారంభమైన చలో కలెక్టరేట్ పాక్షిక పాదయాత్రను శుక్రవారం కన్నెగూడెం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పాదయాత్రకు పోలీసుల అనుమతి తీసుకోలేదని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తుగా అరెస్టు చేశామని ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. కార్యక్రమంలో కొండగొర్ల చంద్రయ్య, సునార్కరి శంకర్, జుమ్మిడి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగింపు

మంచిర్యాలఅర్బన్: ఐటీఐలో ప్రవేశానికి గడువు పొడిగించినట్లు మంచిర్యాల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఈ నెల 19 నుంచి 30 వరకు మూడో దఫా ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పదోతరగతి మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు. జిల్లాలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మోటర్ మెకానిక్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మాన్ సివిల్, కోప(కంప్యూటర్ కోర్సు) డ్రెస్ మేకింగ్, ఫ్యాషన్ డిజైన్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు htpp://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మందమర్రి జీఎంగా మనోహర్


మనోహర్, జీఎం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియా జీఎం గుండ మోహన్‌రెడ్డిని కార్పొరేట్ (సీఎంసీ)కు, ఆయన స్థానంలో ఆర్జీ-2 జీఎం మనోహర్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నెలల క్రితం బదిలీపై వచ్చిన మోహన్‌రెడ్డి ఏరియాలో సింగరేణి క్వార్టర్ల కబ్జాపై కొరడా ఝుళిపించారు. ఒక యూనియన్ నాయకుడు ఐదేళ్లుగా క్వార్టర్‌కు అద్దె చెల్లించకపోవడమే కాకుండా క్వార్టర్ కూల్చివేసి అక్రమ నిర్మాణం చేపట్టిన ఘటనలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను సస్పెండ్ చేయడం, పైరవీలకు తావివ్వకపోవడం, తదితర అంశాలపై జీఎం నిక్కచ్చిగా వ్యవహరించారు. అందుకే కేవలం నాలుగున్నర నెలల్లోనే బదిలీ చేస్తున్నారని ఏరియాలో పలువురు అనుకుంటున్నారు.